నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 18 మార్చి 2024 | ADILABAD

## అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు..

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్, మార్చి 17 : రాజకీయాల్లో చిరకాల మిత్రులు.. చిరకాల శత్రువులు ఉండరని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాజకీయాలకు అతీతంగా గ్రామాలాభివృద్ధి ముఖ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం పూసాయి గ్రామంలోని రేణుకమాత ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి, పంటలతో చల్లంగా ఉండాలని కోరుకున్నాడు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతారెడ్డి పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి



హేమలత మృతదేహం వద్ద మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, మార్చి 17 : జెవులీ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ హేమలత శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

# ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం..

### ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 16,44,715 మంది ఓటర్లు

### 2,111 పోలింగ్ కేంద్రాలు..



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

- ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం
- 85 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు
- రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే పత్రాలు తప్పనిసరి
- సీ-విజిల్, 1950, 8712659973 నంబర్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు
- సోషల్ మీడియాలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు పెడితే చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎన్నికల అధికారి రాజర్షి షా

ఆదిలాబాద్, మార్చి 17(నమస్తే తెలంగాణ) : కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) లోక్‌సభ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలను తొలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రచారం నిర్వహించే రాజకీయ పార్టీల నాయకులు ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. అందరూ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రలోభాలకు గురిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని, నిబంధనల ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సోషల్ మీడియాలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు ఉంటామని హెచ్చరించారు. ఇందుకోసం ఎంసీసీ, సర్వేలైన్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వేలైన్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వహణకు పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉన్నారని, అవసరమైన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అర్హులు ఓటరు జాబితాలో పేరు చూసుకోవాలని, పేరులేని వారు ఏప్రిల్ 15వ తేదీలోగా వివరాలను బీఎల్‌వోకు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో 10 వేలకు పైగా కొత్త ఓటరు కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

### 16.44 లక్షల ఓటర్లు

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎస్టీ-1 కాగా.. మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్ ఉండగా.. ఇందులో 16,44,715 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారి వివరించారు. పురుషులు 8,02,575.. మహిళలు, 8,42,054, ఇతరులు 86, 2,085 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 2,111 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మరో 80 ఆక్సిలరీ కేంద్రాలు కూడా ఉంటాయన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం రెండు కిలోమీటర్ల పరిధిలో ఉంటుందని.. 85 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచి ఓటును వినియోగిచుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు మోడల్, ఐదు మహిళ, ఒక దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్, ఇతర కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు అవసరమైన పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. నగదు సమస్యల పరిష్కారానికి జిల్లా సహకార శాఖ అధికారి మోహన్‌ను నోడల్ అధికారిగా నియమించామని, 8328683965 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

### సరిహద్దుల్లో తనిఖీలు.. : ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఇందుకు ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, తనిఖీలను వీడియో రికార్డింగ్ చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలు కాపాడడంతో పాటు ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, సీ-వీజిల్, డయల్-100, 1950 నంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రజలు 8712659973 వాట్సాప్ నంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు కేంద్ర బలగాలు కూడా వస్తాయని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విజయోస్తు



నిర్మల్ అర్బన్ : పదో తరగతి పరీక్షా కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

### నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా 8,923 మంది విద్యార్థులు
- 47 పరీక్షా కేంద్రాల ఏర్పాటు


నిర్మల్ అర్బన్, మార్చి 17 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నేటి (సోమవారం) నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. 8,923 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా.. ఇందులో 4,309 మంది బాలురు.. 4,614 మంది బాలికలు ఉన్నారు. ఇందుకోసం 47 కేంద్రాలను సిద్ధం చేశారు. 47 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 47 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఏడుగురు కస్టోడియన్‌లు, 500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, ప్రత్యేక బృందాలు కేంద్రాలను పర్యవేక్షించనున్నాయి. కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లు, ఏఎన్‌ఎంను అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి తీసుకొచ్చిన ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేసినప్పటి నుంచి తిరిగి జవాబు పత్రాలను ప్యాక్ చేసే వరకు రికార్డు చేయనున్నారు. ఈ డేటాను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు అందించనున్నారు. ఫలితంగా అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉంటుంది. నిమిషం నిబంధనను తొలగించారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని నిర్మల్ డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు.

### ఆదిలాబాద్‌లో ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 17 : పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని, గంట ముందే వస్తే ప్రశాంతంగా పరీక్ష రాసుకునే వీలుంటుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 10,507 మంది పరీక్ష రాస్తుండగా. ఇందులో బాలురు 5,252.. బాలికలు 5,255 మంది ఉన్నారని తెలిపారు. 53 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

### కేంద్రాల పరిశీలన

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆదివారం డీఈవో ప్రణీత పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.



ఆదిలాబాద్ రూరల్ : కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ డీఈవో ప్రణీత

# అకాల వర్షం


- నేలకొరిగిన పంటలు
- రాలిన మామిడి కాయలు
- లేచిపోయిన పైకప్పులు.. విరిగిన స్తంభాలు..

ఇచ్చోడ/పెంబి/దస్తురాబాద్, మార్చి 17 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శనివారం రాత్రి అకాల వర్షం కురిసింది. పగలు ఎండ ఉండగా.. రాత్రి ఒక్కసారిగా గాలిదుమారంతో వాన పడింది. ఇచ్చోడ, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో పంటలు నేలకొరిగాయి. మొక్కజొన్న పంట ధ్వంసం కాగా.. మామిడి పిందలు, కాయలు నేలరాలాయి. సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని జెండగూడ, సిరిచెల్మ, కుంటగూడ, ఇచ్చోడ, సిరికొండలో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. అక్కడక్కడ స్తంభాలు విరిగిపడ్డాయి. దుకాణాల్లోని సామాన్లు తడిచిపోయాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని రోజుల నుంచి సూర్యుడి ప్రతాపంలో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్న సమయంలో వర్షం కురువడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.



గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న

# విద్యార్థులతో వెట్టిచాకిరీ



బియ్యం బస్తాలను మోస్తున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

కుభీర్, మార్చి 17 : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో హాస్టల్ వార్డెన్ వెట్టిచాకిరీ చేయిస్తున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం భైంసా ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి 150 కిలోల బియ్యం (50 కేజీ మూడు బస్తాలు) ఒక ప్రైవేటు జీపులో హాస్టల్‌కు వచ్చాయి. అప్పుడు అక్కడ కుక్ ఓం ప్రకాశ్ ఉన్నాడు. ఆ మూడు బస్తాలను జీపులో నుంచి లోపలికి విద్యార్థులతో వేయించాడు. ముగ్గురు సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థులతో పని చేయించడం విడ్డూరంగా ఉంది. దీనికి కారణం.. హాస్టల్ వార్డెన్ నగేశ్‌కు భైంసా, కుభీర్ రెండు హాస్టళ్లతోపాటు ఎడ్‌బిడ్ హాస్టల్‌లో(రెగ్యులర్) విధులు నిర్వర్తిస్తూ వారం రోజులకు ఒకసారి చుట్టపు చూపుగా వస్తుంటాడని విద్యార్థులు పేర్కొంటున్నారు. కలెక్టర్ దృష్టి సారించి రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై వార్డెన్ నగేశ్‌ను ఫోన్లో సంప్రదించగా స్పందించలేదు. సిబ్బంది ఓంప్రకాశ్, దర్శన్లను పలుకరించగా మూడు బస్తాలు జీపులో నుంచి తీసి హాస్టల్ స్టోర్‌లో వేసిన మాట వాస్తవమని అన్నారు.

# దండం పెడుతాం.. ఇలా వెళ్లకండి..

- ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దు..
- కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దు..
- ద్విచక్ర వాహనంపై ఐదుగురు వెళ్తుండడంతో కానిస్టేబుల్ విన్నపం

లక్ష్మణచాంద, మార్చి 17 : లక్ష్మణచాంద మండల కేంద్రం నుంచి మామడ మండలంలోని కొరిటికల్‌కు ఆదివారం సాయంత్రం భార్యాభర్తలు ముగ్గురు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సిరిపల్లి వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సంజీవ్ వారి వాహనాన్ని ఆపాడు. 'ఇలా ఒకే వాహనంపై వెళ్తే ప్రమాదాలు జరుగవా. కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవడం మంచిదేనా.. దండం పెడుతా ఇలా ఎప్పుడు వెళ్లకండి' అని పువ్వు ఇచ్చి పంపించాడు. మరోసారి ఇలా ప్రయాణించమని వారు తెలుపారు.



ద్విచక్రవాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న కుటుంబానికి కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుల్ సంజీవ్

# ఉపాధి హామీకి సౌలతులు బంద్

పని ప్రదేశంలో షేర్‌నెట్స్, మందుబిల్లలు, మంచినీరు కరువు

- ఇంటి నుంచే మంచినీటి బాటిళ్లు తెచ్చుకుంటున్న కూలీలు
- మధ్యాహ్నం భోజనం, విశ్రాంతి తీసుకోవడానికి చీరెల నీడే దిక్కు
- కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



సముందర్‌పల్లి చెరువు వద్ద ఎండ తీవ్రత తట్టుకోలేక చీరెలతో తాత్కాలిక టెంటు మాదిరిగా వేసుకొని సేద తీరుతున్న కూలీలు



పూడికతీత పనుల్లో భాగంగా ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న కూలీలు

దిలావర్‌పూర్, మార్చి 17 : వలసలను నివారించి, స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం అనేక మందికి పని కల్పిస్తున్నది. సగటున కూలీకి 100 రోజులు పనికల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టగా.. దిలావర్‌పూర్ మండలంలో 14,018 మంది కూలీలు ఉన్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా పనులకు వెళ్తుండగా.. కనీస వసతులు కూడా కల్పించడం లేదు. ఫలితంగా కూలీలు వడదెబ్బ బారిన పడుతున్నారు.


### కనీస వసతులు కరువు

ఉపాధి హామీ పనులు చేపడుతున్న పని ప్రదేశాల్లో కూలీల కోసం టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టెలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలనే నిబంధన ఉంది. కానీ.. వేసవికాలం ప్రారంభమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. పని ప్రదేశంలో సేదతీరేందుకు చెట్లను ఆశ్రయిస్తున్నారు. అవీ కూడా లేకపోతే తలకు తలపాగా చుట్టుకుని ఎండలోనే భోజనం చేస్తున్నారు. తాగడానికి కనీసం నీరు కూడా అందుబాటులో ఉంచడం లేదు. కూలీలే ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ నీరు కూడా అయిపోతే బావులు, చెరువుల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. గాయాలు, అస్వస్థతకు గురైనా ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవు. దీంతో కొన్నిసార్లు దవాఖానకు చేరేలోపే ప్రాణాలు కూడా కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా నామమాత్రంగా అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### పాత చీరలే టెంట్లు

సముందర్‌పల్లి గ్రామంలో జనవరి నుంచి చెరువు పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. దాదాపు 87 మంది ఉపాధి హామీ కూలీలు రోజూ పనులు చేస్తున్నారు. కాగా.. వారం రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. దాదాపు 39 డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక ఇంటి నుంచి చీరలను తీసుకొచ్చుకుని తాత్కాలికంగా టెంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. భోజన విరామ సమయంలో చీరల నీడ కిందనే విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా.. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా షేర్ నెట్‌లను అందించేవి. కానీ.. ఇప్పటి ప్రభుత్వాలు షేర్ నెట్‌లను ఇవ్వకపోవడంతో చెట్ల కింద, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చీరల కింద సేదతీరుతున్నారు. షేర్ నెట్‌లను అందించాలని కోరుతున్నారు.

### షేర్‌నెట్స్ రావడం లేదు..



కొన్నాళ్ల క్రితం జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి షేర్ నెట్స్ వచ్చేవి. మండల కేంద్రం నుంచి గ్రామంలోని కూలీల సంఖ్యను బట్టి పంపిణీ చేసేవారు. కూలీలు పని ప్రదేశంలో తాత్కాలికంగా షేర్‌నెట్స్ వేసుకుని భోజనం చేసేవారు. మధ్యాహ్న సమయంలో సేదతీరేవారు. కొన్నాళ్లుగా సరఫరా నిలిచింది. దీంతో తాము కూలీలకు నెట్స్ అందించడం లేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం.

- దివ్యరెడ్డి, ఏపీవో, దిలావర్‌పూర్

### సర్కారు సౌలతులు కల్పించాలి..



గతంల సర్కారోళ్లు పనిజేసే కాడ మంచినీళ్లు, మందులు ఇచ్చేటోళ్లు. గిప్పుడేమో మందులేమో గని మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదు. ఇంటి నుంచే బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నం. ఇగ, పానం బాగా లేకపోతే సోయి తప్పి పడిపోతున్నం. గప్పుడేమో దవాఖానకు పోవాల్సి వస్తున్నది. మేము చేసే పైసలన్ని దవాఖానకే పెట్టాల్సి వస్తున్నది. సర్కారోళ్లు గతంల లెక్క షేర్‌నెట్లు, మంచినీళ్లు, మందుబిల్లలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నా.

- సజ్జు, లోలం, దిలావర్‌పూర్

### చీరల నీడన తింటున్నం..



నేను రోజూ ఉపాధి పనులకు పోత. గిప్పుడు సముందర్‌పల్లిలో చెరువు పనులు చేత్తన్నం. జనవరి నుంచి చేత్తుండగా.. ఆరం రోజుల సంది ఎండలు బాగా కొడుతున్నాయ్. గతంల పెద్దసార్లు టెంట్లు ఏర్పాటు చేత్తుండే. ఆటి కింద కూసొని తినేటోళ్లం. గిప్పుడు ఎవ్వలు టెంట్లు ఇయ్యడం లేదు. చుట్టూ పక్కల సూసినం. ఎక్కడ చెట్లు లేవు. గందుకనే నాతో పనిజేసేటోళ్లం అందరం కలిసి ఇంటి నుంచి చీరెలు తెచ్చుకుని టెంటులెక్క ఏసుకున్నం. దానికిందనే మధ్యాహ్నం బువ్వ తింటున్నం. అధికారులు షేర్‌నెట్స్ వేయించాలని కోరుతున్నం.

- అడెల్ల, కూలీ, దిలావర్‌పూర్